సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



శిల్ప కళాశాలలో సమస్యలు

యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహ శిల్ప కళాశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - 8లో



పరిశుభ్రత అలవర్చుకోవాలి

కౌమార దశలో బాలికలు వ్యక్తిగత శుభ్రత అలవర్చుకోవాలని ఎయిమ్స్ వైద్య కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూచించారు. - 8లో



తప్పు జరగలేదు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

'పోషణ్ భీ -పడాయి భీ'పై అవగాహన

రామన్నపేట: పోషణ్ భీ – పడాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు రామన్నపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు హాజరై మాట్లాడారు. చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయడంతో పాటు వారి చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా నవచేతన చిన్నారులు, డిజేబుల్ చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం టీచర్లకు, ఆయాలకు యూనిఫామ్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణ, ఏసీడీపీఓ సమీరా సూపర్‌వైజర్లు బాలమణి, ధనమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం, కలెక్టర్ తదితరులు

భువనగిరిటౌన్ : విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, బీసీ సంక్షేమ అధికారి సాతీతి, విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రోన్ పరికరాల పరిశీలన



డ్రోన్ పరికరాలను పరిశీలిస్తున్న డీసీపీ అక్షాంశ్‌యాదవ్, పోలీసు అధికారులు

గుండాల: మండల కేంద్రంలోని ఎంజేఆర్ వ్యవసాయ క్షేత్రంలో తయారు చేస్తున్న డ్రోన్ పరికరాలను డీసీపీ అక్షాంశ్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి మేరకే పరికరాలను తయారు చేస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. ఆయన వెంట ఏసీపీలు శ్రీనివాస్‌నాయుడు, రాహుల్‌రెడ్డి, సీఐ శంకర్‌గౌడ్, ఎస్ఐ తేజమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి పుట్టిన రోజు మొక్క నాటాలి



మొక్క నాటుతున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి: ప్రతి విద్యార్థి తన పుట్టిన రోజు తప్పనిసరిగా మొక్క నాటాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. బుధవారం భువనగిరి మండలం అనాజిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధరణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ మొక్కలను నాటడంతోనే సాధ్యమవుతుందన్నారు. అదే విధంగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తమ తల్లి పేరున మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగవర్ధన్‌రెడ్డి, ధరణి ఫౌండేషన్ చైర్మన్ లింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్యాగాల ఫలమే స్వేచ్ఛ



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో జిల్లాలో లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుంది.

- సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లాది కీలకపాత్ర
- ఉద్యమ స్ఫూర్తితో అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం

జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్

సాక్షి ,యాదాద్రి : భూమి కోసం భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో ఎందరో అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛగా బతుకుతున్నామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో విలీనమై 77 సంవత్సరాలు పూర్తి చేసుకొని 78వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో మునిగి తేలితే హైదరాబాద్ సంస్థానం ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ఉన్నారని గుర్తు చేశారు. సంస్థానంలో ఎక్కువ మొత్తం భూమి భూస్వాములు, జమీందార్లు, జాగీర్‌దార్లు, దేశ్‌ముఖ్‌ల వద్దనే ఉందన్నారు. రైతులు కౌలు కింద చేతికి అందిన పంటలో అగ్రభాగం చెల్లించాల్సి వచ్చేదన్నారు. 85 శాతం ప్రజలు మాట్లాడే స్థానిక భాష తెలుగుపై నిరాదరణ, ప్రజలు అణచివేత, వెట్టిచాకిరీ, బానిసత్వం కొనసాగిందన్నారు. మరోవైపు ప్రైవేట్ సైన్యం, రజాకార్ల దమనకాండ కొనసాగిందన్నారు. హక్కుల కోసం, దోపిడీ, దౌర్జన్యాలను ఎదిరించిన వారిపై దాడులు, దారుణాలు ఎక్కువ కావడంతో యావత్ ప్రజలు ఎదురు తిరిగారని, ఇది సాయుధ పోరాటానికి దారి తీసిందన్నారు. .

స్వరాష్ట్రంలో ప్రగతి పథం

- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ, 200 యూనిట్ల వరకు జీరో విద్యుత్ బిల్ ఇస్తున్నట్లు తెలిపారు.
- తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 7,808 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. రూ.79.25 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం.
- రైతుభరోసా పథకం కింద జిల్లాలో 2,33,418 మంది రైతులకు ఎకరానికి రూ.12,000 చొప్పున రూ.306 కోట్లు పెట్టుబడి సహాయం అందజేశాం.
- రైతుబీమా పథకం కింద 1,36,853 మంది రైతులు నమోదయ్యారు. 652 మంది రైతులు వివిధ కారణాలతో మరణించగా వారి కుటుంబాలకు రూ.32.60కోట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. రెట్టింపు ఉత్సాహంతో అందరం కలిసికట్టుగా శ్రమించి తెలంగాణను మరింత అభివృద్ధి చేయటానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, ఏఎస్పీ రాహుల్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



భువనగిరి పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, నాయకులు



విద్యార్థుల నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. అదే విధంగా తెలంగాణ అమరుల కుటుంబాలను శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించారు.

ప్రజల్లో చైతన్యం రగిల్చిన నల్లగొండ

తెలంగాణ సాయుధ పోరాటంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలకపాత్ర పోషించిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, శ్రీ బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, జిట్ట రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, కట్కూరి రామచంద్రారెడ్డి, కట్కూరి సుశీలదేవి, సుద్దాల హనుమంతు, బొందుగుల నారాయణరెడ్డి వంటి మరెందరో తెలంగాణలో స్వాతంత్రోద్యమాన్ని ప్రభావితం చేశారన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరులో మొదటిసారి అసువులు బాసిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం ఉధృతం దాల్చిందన్నారు. బండి యాదగిరి రాసిన 'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లో పోతావు కొడుకో.. నైజాం సర్కారోడో' పాట ప్రజల్లో చైతన్యం రగిలించిందన్నారు. ఓవైపు సాయుధ పోరాటం..మరోవైపు భారత సైన్యం రంగంలోకి దిగడంతో చేసేదిమిలేక అప్పటి నిజాం ప్రభువు హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించాని పేర్కొన్నారు.

మహిళలకు మెరుగైన వైద్యసేవలు

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



మహిళల హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: మహిళల ఆరోగ్య పరిరక్షణ, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్వస్థ్‌నారి–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం భువనగిరిలోని జనరల్ ఆస్పత్రిలో మహిళల మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. మెడికల్ క్యాంపులలో ఎనిమది రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇస్తారని, ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్వస్థ్ నారి–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఆస్పత్రి సూపరిండెంటెండ్ పాండునాయక్, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, డీసీహెచ్ఎస్ చిన్ననాయక్, డిప్యూటీ సూపరిండెంటెండ్ సద్గుణాచారి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవెజ్ చిస్తీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించాల్సిందే

- కలెక్టర్ హనుమంతరావు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

సాక్షి,యాదాద్రి : రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణాలను కాపడేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. రోడ్డు భద్రతపై బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే అన్ని శాఖల మధ్య సమన్వయంతో తప్పనిసరి అన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని,బ్లాక్ స్పాట్లను గుర్తించి సూచిక బోర్డులు, రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, బ్లింకర్స్ ఏర్పాటు చేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని స్పష్టం చేశారు. వాహనాల వేగ పరిమితిని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ధర్మోజిగూడెం క్రాస్ రోడ్డు, కొయ్యలగూడెం బస్టాప్, వలిగొండ ఎక్స్ రోడ్డు, అనంతారం బ్రిడ్జి, మోత్కూర్–పాటిమట్ల ఎక్స్‌రోడ్డు వద్ద అధికంగా ప్రమాదాలు జరుగుతుంటాయని, ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఈ రవీందర్, రోడ్లు భవనాల అధికారి సరిత తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో ఏకాదశి పూజలు



ఉత్సవమూర్తులకు లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. స్వామివారి మేల్కొలుపులో భాగంగా వేకువ జామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భగుడిలో స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో శాస్త్రోక్తంగా అర్చించారు.

పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం 'రావి'

- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



రావి నారాయణరెడ్డి విగ్రహావిష్కరణలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ హనుమంతరావు, రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు

భువనగిరి: రాజకీయ చైతన్యానికి, పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపం రావి నారాయణరెడ్డి అని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లో మార్పులు రావాలని అవసరం ఉందన్నారు. భువనగిరి మండలం బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ.. అప్పటి నాయకులు సేవాదృక్పథంతో పని చేసేవారని, ప్రస్తుత రాజకీయాల్లో దోరణి మారిందన్నారు. తొలి లోక్‌సభ ఎన్నికల్లో నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీ సాధించిన నాయకుడిగా రావి నారాయణరెడ్డి ఉండటం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టం అన్నారు.గాంధీజీతో కలిసి స్వాతంత్ర్యం కోసం పనిచేశారని, ఆ తరువాత 1941లో ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించి నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరు సాగించారని పేర్కొన్నారు. నల్లగొండ గడ్డ ఎంతో మంది మహానుభావులు పుట్టిన గడ్డ అని, అలాటి వారిలో రావినారాయణరెడ్డి ఒక్కరు అన్నారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని, తన వంతుగా రూ.15 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రావి నారాయణరెడ్డి తన సొంత భూమి 500 ఎకరాలకు పేదలకు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని కోరారు. భువనగిరితో పాటు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ పై రావి నారాయణరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ హనుమంతరావు, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖబాబురావు, రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ మధుసూదన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నిజమైన వారసులు కమ్యూనిస్టులే



చౌటుప్పల్‌లో ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్



గుడిమల్కాపురంలో మాట్లాడుతున్న జహంగీర్

చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చేపట్టిన బస్సు యాత్ర బుధవారం చౌటుప్పల్ మీదుగా సంస్థాన్‌నారాయణపురం మండలం గుడిమల్కాపురం చేరుకుంది. సాయుధ పోరాట యోధుడు మన్నె బక్కారెడ్డి స్తూపానికి నివాళులర్పించి వారోత్సవాలు ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తికోసం కమ్యూనిస్టులు వీరోచితమైన పోరాటం చేశారని పేర్కొన్నారు. సంబంధం లేని వ్యక్తులు చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు చౌటుప్పల్‌లో మాజీ ఎంపీ ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ విగ్రహాలకు నివాళుర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, వెంకటేష్, బూరుగు కృష్ణారెడ్డి, గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, ఎండీ పాష, బండారు నర్సింహ, పల్లె మధుకృష్ణ, దశరథ, బొడ్డు అంజిరెడ్డి, కొండె శ్రీశైలం, జి.శ్రీనివాసచారి, దోడ యాదగిరిరెడ్డి, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, దోనూరి నర్సిరెడ్డి, దొంతగోని పెద్దులు, తుమ్మల నర్సిరెడ్డి, లలిత, కృష్ణయ్య, వెంకటేశ్, సైదులు తదితరలు పాల్గొన్నారు.

పటేల్‌తోనే తెలంగాణకు విముక్తి

భువనగిరి: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ విమోచన దినం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. సర్దార్ వల్లభబాయ్ పటేల్‌తోనే తెలంగాణకు నిజాం నుంచి విముక్తి లభించందన్నారు. తెలంగాణ విమోచన కోసం ఎంతో మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్ గుప్తా, కాటూరి అచ్చయ్య, కొప్పుల యాది రెడ్డి, ఉపాధ్యక్షులు గూడూరు నరోత్తంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, వైజయంతి, కోటేష్, సీనియర్ నాయకులు మాయ దశరథ, రత్నపురం బలరాం, డీఎల్ఎన్‌గౌడ్, నరసింహరావు, రామకృష్ణ, ఊదరి లక్ష్మి, మల్లిక, కృష్ణాచారి, మహమూద్, సతీష్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



జాతీయ జెండా ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్



ఆత్మకూరు(ఎం) పీఏసీఎస్ వద్దకు యూరియా కోసం వచ్చిన రైతులు



గుండాల పీఏసీఎస్ ఎదుట నిరీక్షిస్తున్న రైతులు

అదే కొరత.. అదే వ్యథ

ఆత్మకూరు(ఎం), గుండాల : యూరియా కోసం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. గంటల తరబడి నిరీక్షించినా బస్తా యూరియా కూడా దొరకవడం లేదు. ఆత్మకూరు(ఎం) పీఏసీఎస్‌కు బుధవారం యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకొని రైతులు ఉదయం నుంచే భారీగా తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. 440 బస్తాలు యూరియా రాగా 300 మంది రైతులకు వచ్చారు. ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయగా.. యూరియా దొరకని రైతులు నిరాశతో వెళ్లిపోయారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 45 లారీల యూరియా పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ సీఈఓ యాస కిరణ్ తెలిపారు. అదే విధంగా గుండాల పీఏసీఎస్‌కు 10 టన్నుల యూరియా రాగా రైతులు భారీగా తరలివచ్చారు. యూరియా దొరకని రైతుల పాస్ పుస్తకాల జిరాక్స్‌లపై పీఏసీఎస్ సిబ్బంది సంతకాలు చేసి యూరియా వచ్చిన తరువాత రావాలని సూచించారు.


నల్లగొండలోని నిర్వహించిన ప్రజాపాలన వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


భువనగిరి కలెక్టర్‌లో ప్రజాపాలన వేడుకల్లో జెండాకు సెల్యూట్ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా, కలెక్టర్ తదితరులు


సూర్యాపేటలో ప్రజాపాలన వేడుకల్లో జాతీయ గీతం ఆలపిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సామేల్ తదితరులు


సూర్యాపేట కలెక్టరేట్‌లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

వాకింగ్ చేస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి


వెంకన్న (ఫైల్)

మునగాల: వాకింగ్ చేస్తుండగా గుండెపోటుతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం మునగాల మండల కేంద్రంలో జరిగింది. మునగాల మండల కేంద్రానికి చెందిన సుంకరి వెంకన్న(57) రోజుమాదిరిగా బుధవారం ఉదయం ఇంటి నుంచి వాకింగ్‌కు బయల్దేరాడు. స్థానిక పోలీస్ స్టేషన్ ముందుకు రాగానే గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. స్థానికులు సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య గతంలోనే మృతిచెందింది. వెంకన్నకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి..


ప్రకాశ్‌రావు (ఫైల్)

మేళ్లచెరువు: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నదిలో పడి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం చింతలపాలెం మండలం నెమలిపురి గ్రామ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామానికి చెందిన పూజ ప్రకాశ్‌రావు (46) చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే బుధవారం పడవపై కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లాడు. నెమలిపురి సమీపంలో చేపలు పడుతుండగా.. కాలు జారి నదిలో పడిపోయాడు. తోటి జాలర్లు గమనించి ప్రకాశ్‌రావును నదిలో నుంచి బయటకు తీసేసరికి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గోశాలలో ప్రత్యేక పూజలు


కృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట: కణ్ణన్ తిరునక్షత్ర ఉత్సవాలను పురస్కరించుకొని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనుబంధంగా మల్లాపురం రోడ్డులోని మామిడి తోటలో ఉన్న గోశాలలో శ్రీకృష్ణుడికి, గోమాతకు ఆలయ అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, డిప్యూటీ ఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంజీయూలో ప్రజాపాలన దినోత్సవం


జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అలువాల రవి, కొప్పుల అంజిరెడ్డి, ఆకుల రవి, జి. ఉపేందర్ రెడ్డి, హరీష్ కుమార్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

సరైన వసతుల్లేని శిల్ప కళాశాల

- వర్షానికి కురుస్తున్న పైకప్పు
- అదే కళాశాలలో కొనసాగుతున్న సంస్కృత విద్యాపీఠం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- నూతన భవనంలోకి మార్చాలని డిమాండ్



శిల్ప కళాశాల, సంస్కృత విద్యాపీఠం కొనసాగుతున్న భవనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీలక్ష్మీ నరసింహ శిల్ప కళాశాలలో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా గదులు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో శిల్ప కళాశాలలో విద్యార్థులు కూర్చునే గది పైకప్పు నుంచి నీరు లీకవ్వడంతో భయాందోళనకు గురయ్యారు. శిల్ప కళాశాల నిర్వహిస్తున్న భవనంలోనే శ్రీలక్ష్మీనరసింహస్వామి సంస్కృత విద్యాపీఠంను కూడా కొనసాగిస్తున్నారు.

తెలంగాణలోనే మొదటిది..

తెలంగాణలోనే మొదటి శిల్ప కళాశాలను 2019లో యాదగిరిగుట్ట పట్టణంలో స్థాపించి, సర్టిఫికెట్ కోర్సులు మొదలుపెట్టారు. 2022–23 విద్యా సంవత్సరంలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ), హైదరాబాద్ అనుబంధంతో 3 సంవత్సరాల బీఏ కోర్సును ప్రారంభించారు. గతంలో శిల్ప కళను నేర్చుకునేందుకు రాష్ట్రంలోని పలువురు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుమలలో ఏర్పాటు చేసిన శిల్ప కళాశాలకు వెళ్లేవారు. అయితే సంప్రదాయ దేవాలయ శిల్ప కళాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం, వైటీడీఏ ఆలోచనతో శ్రీలక్ష్మీనరసింహ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ స్కల్ప్చర్ అండ్ ఆర్కిటెక్చర్ పేరుతో యాదగిరిగుట్టలో శిల్ప కళాశాలను ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం 28 మంది విద్యార్థులు..

ఈ శిల్ప కళాశాలలో ప్రస్తుతం 28 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 28 మంది విద్యార్థులకు గాను ఆరు గదులు ఉండాలి. కానీ ఇక్కడ మూడు గదులు మాత్రమే ఉండగా.. ఇందులో ఒక గదిని ఆఫీస్ రూమ్ కోసం, మరో రెండింటిని విద్యార్థులకు కేటాయించారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో ఒక గది పైకప్పు నుంచి వర్షం నీరు లీకేజీ అవుతున్నాయి. దీంతో నిర్వాహకులు ఆ గదిని ఖాళీ చేసి, విద్యార్థులందరినీ ఒకే గదిలోకి పంపించారు. దీంతో అందులోనే విద్యనభ్యసించడంతో పాటు ప్రాక్టికల్స్ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మూడు సెమిస్టర్లు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. యాదగిరీశుడి ప్రధానాలయ పునఃనిర్మాణంలో స్థపతులుగా పనిచేసిన నలుగురు శిల్ప కళాశాలలో అధ్యాపకులుగా కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్నారు.


శిల్ప కళాశాలలో శిల్పాన్ని చెక్కుతున్న విద్యార్థి

శిల్ప కళాశాలకు రాబోయే రోజుల్లో విద్యార్థుల సంఖ్య పెరగనున్న నేపథ్యంలో విశాలంగా ఉండేందుకు 2 ఎకరాల స్థలంతో పాటు రెగ్యులర్ అధ్యాపకులను ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సంస్కృత విద్యాపీఠం ఇదే భవనంలో..

శిల్ప కళాశాల నడుస్తున్న భవనంలోని మొదటి అంతస్తులో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అనుబంధంతో శ్రీలక్ష్మీనరసింహస్వామి సంస్కృత విద్యాపీఠాన్ని నడిపిస్తున్నారు. ఈ విద్యాపీఠంలో సుమారు 68మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పై అంతస్తులోనే విద్యార్థులు చదువుకోవడంతో పాటు అక్కడే మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ఇందులో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కొనసాగుతుంది. ఈ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు సైతం సరిపడా గదులు లేకపోవడం గమనార్హం. కాగా.. యాదగిరిగుట్ట పట్టణానికి సెంటర్‌గా ఉన్న ఈ భవనాన్ని 2005లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కొనసాగించేందుకు అదనపు గదులను నిర్మించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత గోశాల సమీపంలో కొనసాగుతుండగా.. ఐదేళ్ల క్రితం సంస్కృత విద్యాపీఠం, శిల్ప కళాశాలను కొనసాగించేందుకు దేవస్థానం, వైటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు.


శిల్ప కళాశాలలోని గది పైకప్పు నుంచి నీరు లీకవుతుండడంతో తట్టలను పెట్టిన దృశ్యం

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



యాదగిరిగుట్టలో 2019లో శిల్ప కళాశాలను సర్టిఫికెట్ కోర్సుగా ప్రారంభించాం. అనంతరం వైటీడీఏ, దేవస్థానం, అప్పటి ప్రభుత్వ పెద్దలు 2022–23లో జేఎన్ఏఎఫ్ఏయూ, హైదరాబాద్ అనుబంధంతో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో 28 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఒక గది పైకప్పు నుంచి నీరు లీకేజీ అవుతుంది. దీంతో విద్యార్థులను మరో గదిలోకి మార్చాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో చోటుకు కళాశాలను మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మోతీలాల్, శిల్ప కళాశాల ప్రిన్సిపాల్

పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో తప్పు జరగలేదు

- మెరిట్ ప్రకారమే గ్రూప్–1 జాబితా
- ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు


సూర్యాపేటలో అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

భానుపురి(సూర్యాపేట): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని, మెరిట్ ప్రకారమే గ్రూప్–1 జాబితా తయారు చేసిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవంలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రతిభావంతుల మేధస్సును కించపరుస్తూ మానసికంగా దెబ్బతీయటానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఎక్కడా తప్పు జరగలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, మంగళవారమే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రిని కలిసి యూరియాను ఎక్కువ మొత్తంలో సరఫరా చేయాలని కోరారని చెప్పారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, గడిచిన 20 నెలలు సంక్షేమ పాలన అందించామని, అదే విధంగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రభుత్వం రూ.600 కోట్లు మంజూరు చేసిందన్నారు.

యువత ముందుకొస్తే ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తాం

నార్కట్‌పల్లి: యువత, ఎన్‌ఆర్‌ఐలు ముందుకొస్తే నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ స్థలంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. బుధవారం మంత్రి సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లి శివారులోని ఓ హోటల్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందించి యువత, ఎన్‌ఆర్‌ఐలు ఐటీ పార్కు ఏర్పాటుకు ముందుకొస్తే ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ పూర్తయిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం స్థానిక నాయకులు మంత్రిని సన్మానించారు. మంత్రి వెంట పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, ఇరుకుల భిక్షమయ్య, సోమ మధుసూదన్‌రెడ్డి, ప్రజ్ఞాపురం సత్తి, ఎస్‌కే సమద్, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, దూదిమెట్ల వెంకన్న, ఉన్నారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలి

- బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్


అవగాహన సదస్సులో పాల్గొన్న అహంతెం శాంతాసింగ్

బీబీనగర్: కౌమార దశలో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్ సూచించారు. స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీబీనగర్ గురుకుల ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుతు పరిశుభ్రత, పోషకాహారం, రక్తహీనతపై విద్యార్థినులకు అవగాహన కల్పించి శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థినులకు రంగోళి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మాధవీలత, ఎయిమ్స్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భారతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బీసీ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, భోజనాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్ మాధవికి పలు సూచనలు చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న డిండి వాగు


మన్నెవారిపల్లి–చందంపేట మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న డిండి వాగు

- నిలిచిన రాకపోకలు

చందంపేట: డిండి ప్రాజెక్టు అలుగు పోస్తుండడంతో డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో చందంపేట మండలంలోని మన్నెవారిపల్లి, సిద్ధాపురం, బక్కలింగాలపల్లి, అక్కారం, ఐనూర్, బొమ్మన్‌పల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల వారు ఏదైనా అవసరమైతే దేవరకొండకు వచ్చేవారు కానీ.. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అచ్చంపేటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా దేవరకొండ నుంచి మద్దిమడుగు మీదుగా శ్రీశైలం వెళ్లే వాహనాలు డిండి మీదుగా వెళ్తున్నాయి. 25 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి క్యాంపు ఆఫీస్‌లో సీఎం ఫొటో

- కార్యకర్తలతో వెళ్లి పెట్టిన మార్కెట్ చైర్మన్


సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఫొటోలను పెట్టిన మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట : సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు లేకపోవడం పట్ల సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తూ బుధవారం కార్యకర్తలతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి సీఎం, మంత్రి ఫొటోలను పెట్టారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను బీఆర్ఎస్ ఆఫీస్‌లా మార్చారంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా.. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ మాజీ సీఎం కేసీఆర్ ఫొటోను అలానే ఉంచడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారిక బంగ్లా అయినందున సీఎం, జిల్లా మంత్రి ఫొటోలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సీఎం, మంత్రి ఫొటోలు తొలగిస్తే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

- ఇది వడిసెల మేడమ్..


నల్లగొండలో సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో బృందా కరత్‌కు వడిసెల గురించి వివరిస్తున్న చెరుపల్లి సీతారాములు

- మీ త్యాగం గొప్పది


తెలంగాణ సాయుధ పోరాట యోధుల కుటుంబ సభ్యులను సన్మానించి ఆప్యాయంగా పలకరిస్తున్న బృందా కరత్

సెల్‌ఫోన్లు అప్పగింత

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన సుమారు రూ.3.75లక్షల విలువైన 20 సెల్‌ఫోన్లను బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితులకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత వివరాలు ఆయా పోలీస్ స్టేషన్‌లో నమోదువుతాయని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా సంబంధిత బిల్లులు, ఐఎంఈఐ నంబర్లు భద్రపర్చుకోవాలన్నారు. పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, జయరాజు, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.


బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల కేంద్ర శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం ఫత్తేపురం గ్రామానికి చెందిన ఊరె శ్రీనివాస్(50) బుధవారంన అత్తగారి ఊరైన పొనుగోడు నుంచి ఫత్తేపురం గ్రామానికి బైక్‌పై వస్తుండగా.. గరిడేపల్లి మండల కేంద్రం శివారులోని ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..


బాలయ్యగౌడ్ (ఫైల్)

భువనగిరిటౌన్ : బైక్‌పై వెళ్తున్న గీత కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం అనాజిపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు నారగోని బాలయ్యగౌడ్(56) బైక్‌పై భువనగిరికి వచ్చి పెట్రోల్ పోయించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. భువనగిరి పట్టణంలోని నల్లగొండ రోడ్డుపై ఎదురుగా వస్తున్న నల్లగొండ డిపో బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలయ్యగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ తెలిపారు.

ముగ్గురు కవులకు సాహిత్య పురస్కారాలు

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు కవులు సాహిత్య పురస్కారాలకు ఎంపికయ్యారు. నార్కట్‌పల్లి మండలానికి చెందిన సాగి కమలాకరశర్మ ఇటీవల దివాకర్ల వేంకటావధాని సాహిత్య పురస్కారానికి ఎంపిక కాగా.. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్. రఘు, సూర్యాపేట జిల్లా అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి కృష్ణారెడ్డి తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారాలకు ఎంపికయ్యారు.

అద్భుత సాహిత్యం శ్రీరామోజు రఘు సొంతం




ఆచార్య డా. శ్రీరామోజు రఘు అద్భుతమైన సాహిత్యానికి కేరాఫ్ అని చెప్పవచ్చు. ఈయన అధ్యయనం, అధ్యాపనం, విమర్శ, కవిత్వం, పాఠ్య ప్రణాళిక రూపకల్పనా శిల్పి. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన రఘు ఎన్జీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ తెలుగు, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలోనే తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు భారతీయాంగ్ల కవిత్వంలో అస్తిత్వ వేదన అనే అంశంపై ఎంఫిల్, ఆధునిక కవిత్వంలో అంతర్ముఖీనత అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. అనేక జాతీయ, అంతర్జాతీయ సాహిత్య సదస్సుల్లో పాల్గొని 60కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయన రచించిన సమన్వయ విమర్శ గ్రంథానికి రాష్ట్రస్థాయిలో మూడు అవార్డులు లభించాయి. కథ, కవిత్వం, నవల నాటక మొదలైన భిన్న ప్రక్రియల్లో ఆయన వ్యాసాలు రచించారు. ఇటీవల తెలుగు యూనివర్సిటీ ప్రకటించిన కీర్తి పురస్కారం–2024కు సాహిత్య విమర్శ రంగంలో ఆయన ఎంపికయ్యారు.

తెలుగు మమకారి సాగి కమలాకరశర్మ



ఆచార్య డా. సాగి కమలాకరశర్మకు తెలుగు భాష అంటే అమితమైన మమకారం. ఆయన స్వస్థలం నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం. డిగ్రీ వరకు సైన్స్ చదువుకుని తెలుగుపై ఉన్న మమకారంతో ఎంఏ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. సంస్కృతం, ఇంగ్లిష్, జ్యోతిష్యం, యోగా, తత్త్వశాస్త్రాల్లో ఎంఏ పూర్తిచేశారు. తెలుగు యూనివర్సిటీ జ్యోతిష్య విభాగంలో 10 సంవత్సరాలు అధ్యాపకుడిగా పనిచేశారు. 2007లో ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం తెలుగు శాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 13కు పైగా గ్రంథాలు రచించారు. వివిధ పత్రికల్లో 300లకు పైగా వ్యాసాలు, 100పైగా పత్ర సమర్పణలు చేశారు. రామరాజు జానపద విజ్ఞాన పురస్కారం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ పురస్కారం వంటివి 10కిపైగా అందుకున్నారు. ఈయన పర్యవేక్షణలో 14 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టా పొందారు. మూసీ సాహిత్య ధార, జ్యోతిర్వాణి, వేద సంస్కృతి పరిషత్ వంటి సంస్థలను స్థాపించి నేటి సమాజానికి సాహిత్యాన్ని అందిస్తున్నారు. తెలుగు భాషా సాహిత్యానికి విశేష కృషి చేస్తున్నందుకు గాను తెలంగాణ సారస్వత పరిషత్తు వారి సాహిత్య పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు.

ఆర్తి వచన కవిత్వంలో ప్రసిద్ధుడు బైరెడ్డి కృష్ణారెడ్డి



బైరెడ్డి కృష్ణారెడ్డి స్వస్థలం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం. వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తిచేశారు. 34 సంవత్సరాలు అధ్యాపకుడిగా పనిచేశారు. ఎన్జీ కళాశాలలో డిగ్రీ అధ్యాపకుడిగా పదవీ విరమణ పొందారు. ఆర్తి అనే పేరుతో 4 కవిత్వ సంపుటాలు ప్రచురితమయ్యాయి. దీంతో పాటు మరో రెండు సంపుటాలు వెలువడనున్నాయి. ఇంగ్లిష్ లెక్చరర్ అయిన కృష్ణారెడ్డికి తెలుగు సాహిత్యంలో మానవీయ బంధాలు, ఆర్ద్రత కలిగిన కవిత్వం రాసే కవి అని పేరు. ప్రతిష్టాత్మకమైన తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం–2024కు ఎంపికయ్యారు.